# 3

# మా సామర్థ్యం దేవునినుండి కలిగింది

## 2 కొరింథీయులకు 3:4-4:6

"... యిట్టి నిరీక్షణ గలవారమై, బహు ధైర్యముగా మాటలాడుచున్నాము" (3:12).

ప్రభుత్వ పదవికి ప్రచారం చేసే అభ్యర్థులను గమనించినప్పుడు, దేశంలోని క్లిష్ట సమస్యలను ఎదుర్కొను విషయములో వారు చూపిన సంపూర్ణమైన ఆత్మ విశ్వాసమును చూచి నేను తరుచుగా ఆశ్చర్యపోయాను. ఈ సమస్యలను ఎదుర్కొనుటకు తమకుగల సామర్థ్యము విషయములో ఆత్మ విశ్వాసమును ప్రదర్శించనియెడల ఏ అభ్యర్థియూ వోటర్ల నమ్మకమును పొందలేడు. కావున, అహంకారంతో కూడిన స్వరముతో కాక, అతడు ధరలపెరుగుదల, నిరుద్యోగ సమస్యలను సవాలుతో ఎదుర్కొనగలనని చెప్పుతూ ఉంటాడు. ఆ సమస్యలు మానవుడు పరిష్కరించలేనంత దూరంగా ఉన్నాయని చింతనాపరులైన అనేకులు దృఢంగా చెప్పుచున్నప్పటికీ, ఏదియేమైన, సమస్యలను సవాలుతో ఎదుర్కొనగలననే ధైర్యమును అభ్యర్థి కనబరచుతాడు.

ఏ పనియు చేయలేనంత గొప్పదేమీ కాదన్న ఆత్మ విశ్వాసముగలవారిని ప్రశంసించు ప్రజలగా ఉన్నాం. మన ఆత్మ విశ్వాసం వృద్ధి చేసుకొనుటకు రూపుదిద్దబడిన స్వయం సహాయక కోర్సులు ఉన్నాయని ప్రసార మాధ్యంలో ప్రకటిస్తున్న వాటిని మనమందరం వింటూ ఉన్నాం. "దాగియున్న వనరులను కనుగొనుట" అనేది ఏ పనిలోనైన ఆచరణ యోగ్యంగా విజయము వైపు నడిపించగల కోర్సుగా చెప్పబడింది. *సంగీత స్వరాలు* అనే సినిమాను చూస్తుండగా, ఒక పెద్ద కుటుంబంలో గవర్నర్‌గా ఉండవలసిన కష్టతర బాధ్యతను గూర్చి మరియాకు చెప్పినప్పుడు – ఆమె విజయోత్సవ ఆత్మనిగ్రహము మనలకు ఆనందం కలిగిస్తుంది. ఆమె మనకు దిగ్భ్రమ కలిగిస్తూ, "నాలో నాకు ఆత్మ విశ్వాసం ఉంది" అని పాడుతు పనికి వెళ్ళింది.

మన శక్తి సామర్థ్యాల మీద విశ్వాసం అంతగా లేకుండాకూడా కొన్ని సవాళ్ళను ఎదుర్కొగలమనేది నిజమైనప్పటికీ, ఆత్మ విశ్వాసం వికటిస్తుందని, అది ప్రమాదకరమైనదనే మాట కూడా నిజం. ప్రజా నాయకునికున్న ఆత్మవిశ్వాసం, అతని శక్తిని అతడు అధికంగా అంచనా వేసుకున్నాడని, తన సామర్థ్యం మీద అర్థరహితమైన విశ్వాసం కలిగి ఉండడాన్ని తెలుపుతుంది. సెల్ఫ్–హెల్ప్ కోర్సు స్వయం శక్తిమీదున్న నమ్మకం, దానినెలా నిర్వహించాలో సూచించరనే ఒక గురిని ఏర్పరుస్తుంది. అసలు అందులోని భావం ఏమిటంటే ఆత్మవిశ్వాసం మనం ముందుకు నడిచేందుకు తలుపును తెరుస్తుంది, కాని ఒక నిమిత్తమైన కారణాన్ని చూపదు. అందుకనే మరియ కూడ "నాలో నాకు ఆత్మవిశ్వాసం ఉంది" అనేదానిలో ప్రమాదం ఉంది.

సంఘ పరిచర్యలో ఆత్మ ధైర్యం ముఖ్యమైనది. పెద్దలకు, పరిచారకులకు, ఉపదేశకులకు ఏదో ఒక ధైర్యం అవసరం. మనం ఎలాంటి ధైర్యమును ప్రదర్శిస్తాం అనేది ముఖ్యమైన విషయం. నాయకత్వపు పనిని గూర్చి నిమగ్నులై కొంతమంది నాయకత్వపు పిలుపునకు ప్రత్యుత్తరమిస్తారు. దేవుని పనిలో తమనుతాము లోబరచుకొనుట శ్రేష్ఠమైనదానిని కోరుతుందని వారు సరిగ్గా చూస్తున్నారు. దేవుని పని అసాధారణంగా కోరుతున్నందున, వారు బాధ్యతలను స్వీకరించ నిరాకరిస్తారు. మరికొందరు వారి సొంత సామర్థ్యము పై సంపూర్ణమైన నమ్మకంతో ముఖ్యమైన పనులను చేపడతారు. వ్యాపారంలోను మరియు వృత్తి సంబంధిత ప్రపంచంలోను పనిచేసిన ధైర్యం క్రైస్తవ పనికి సరిపోతుందని వారు ఊహించుతారు. సంఘ నాయకత్వము కూడ తదితర నాయకత్వంలో "మనలను మనమే అమ్మివేసుకొనుట" లాంటిదేనని భావిస్తారు. 2 కొరింథీయులకు వ్రాసిన పత్రిక సూచించు ప్రకారం, ఈ రెండు విధానములు క్రైస్తవ పద్ధతిని వికృతీకరించును.

3వ అధ్యాయములో, తన ఆత్మ విశ్వాసమును కొరింథు సంఘమునకు పౌలు దృఢపరుస్తున్నాడు: "క్రీస్తు ద్వారా దేవుని యెడల మాకిట్టి నమ్మకము కలదు" (3:4). తరువాత, అతడు యిలా అన్నాడు, "... బహు ధైర్యముగా మాటలాడుచున్నాము" (3:12, 13). తన యెదుట ఉంచబడిన పని విషయమై భయపెట్టుటను తిరస్కరించు పరిచారకుని ఆత్మ విశ్వాసం, ధైర్యం, మరియు స్వాతంత్ర్యం అనేవి పరిచర్య పై వ్రాసిన ఈ పుస్తకములోని ముఖ్యమైన విషయాలు (3:17). తన పాత్రను నెరవేర్చుటలోని అతని ధైర్యము క్రైస్తవుని చిహ్నం.

## ఎటువంటి ధైర్యం? (3:4-6)

పౌలు తన పనిలో ధైర్యంగా ఉండుటకు కారణం ప్రత్యేకంగా లేదని యితరులు సూచించినందున ఆ మాటలను రాసినట్టుంది. తమ సామర్థ్యమందు అపరిమితమైన నమ్మకంగలవారు కొందరు తమ్మును తామే "క్రీస్తు పరిచారకులని" (11:23) చెప్పుకొంటు కొరింథీనకు వచ్చారు. వారు తమ గొప్ప పనులను గురించి వివరించు "సిఫారసు పత్రికలతో" వచ్చారని 3:1 తెలుపుతుంది. వారు తమ్మును తాము తరుచుగా "మెప్పించుకొనుచున్నారనే" (10:12) వాస్తవం వారెంత మాత్రం తమ సామర్థ్యమందు నమ్మకమును చెడినవారు కారని నిరూపిస్తుంది. పౌలు అటువంటి సిఫారసు పత్రికలను తెచ్చుకోలేనందున, అతడు తన పని విషయంలో ధైర్యం లేనివాడని స్పష్టంగా చెప్పుచున్నారు. కావున, పరిచర్య కొరకైన తమ సామర్థ్యం విషయములో ఏ సందేహమూ లేనివారై తమ్మును యితరులతో పోల్చుకొన్నారు.

యిటువంటి ధైర్యం విషయమై ప్రత్యుత్తరమిస్తూ, పౌలు యిలా నొక్కి చెప్పాడు, "క్రీస్తుద్వార దేవునియెడల మాకిట్టి నమ్మకము కలదు" (3:4). "మావలన ఏదైన అయినట్టుగా ఆలోచించుటకు మాయంతట మేమే సమర్థులమని కాదు, ..." (3:5) అని చెప్పుతునందున, పౌలు యొక్క ధైర్యం అబద్ధ ఉపదేశకుల ధైర్యం కంటె భిన్నమైనది. దేవుని సంకల్పమును నిర్వహించుట ఏ మానవ సేవకునికైనను గల సామర్థ్యమునకు అందరానిది. (దేవుని పని ఏ మానవ సేవకునికైనను దానిని నిర్వహించుటకు సాధ్యము కానిది.) బహుశ విరోధులు ఆ పనికి తాము సమర్థులని తమ సిఫారసు పత్రికలో పేర్కొన్నారు. క్రైస్తవ పరిచర్య విషయంలో మన ధైర్యమును గురించిన అపూర్వమైన వాస్తవ లక్షణమిది. మన వ్యక్తిగత బలహీనత

ఎరిగియుండియూ కూడ; మన పరిచర్యలో ధైర్యమును కలిగియున్నాం.

కొందరు "తాము సమర్థులమని" చెప్పుకొన్నందున, కొరింథీలతో చేసిన చర్చలో పౌలు వాడిన "చాలినంత" (*hikanos*) అనే పదం ముఖ్యమైనది. దేవుని విజయోత్సవమునకు గల కారణములను గురించి మాట్లాడిన తరువాత "కావున యిట్టి సంగతులకు చాలినవాడెవడు?" [*hikanos*] అని పౌలు అడిగాడు (2:17). "ఎవడూలేడు" అనేది లోన అణగియున్న జవాబు. పౌలు మాటలయందు కనిపించు బలహీనతను, మరియు అతని అస్వస్థతను గుర్తించిన కొందరు "అతనిని సమర్థుడు కాడని" తీర్మానించారు. ఆ ఆరోపణనను పౌలు సంపూర్ణంగా అంగీకరించాడు.

పౌలు అసమర్థుడనే నేరారోపణను అంగీకరిస్తూ, అతని ధైర్యమును గురించి మాట్లాడుతున్నాడనేది హాస్యంగా ఉంది. కాని యిట్టి ధైర్యమునకు కారణమేమనగా "క్రీస్తుద్వారా దేవుని యెడల మాకిట్టి నమ్మకము కలదు. మావలన ఏదైన అయినట్లుగా ఆలోచించుటకు మాయంతట మేమే సమర్థులము కాదు; మా సామర్థ్యము దేవునివలననే కలిగియున్నది" (3:5, 6). పౌలుకు ధైర్యం తన స్వంత శక్తిని బట్టి మరియు వ్యక్తిగతమైన వరములను కలిగియున్నందున వచ్చింది కాదు; అతనిని దేవుని శక్తి పిలిచిందని మరియు దేవుడు తన సంకల్పములో అతనిని ఉపయోగించుకొంటాడని పౌలు ఎరిగియున్నాడు.

ఆకర్షించుటలో ప్రసిద్ధులు కాని "సేవకుల" లేక "పరిచారకుల" ద్వార ఎల్లప్పుడు దేవుడు తన పనులను చేయించాడు. పాత నిబంధన పరిచారకుడైన మోషే తన అర్హతను గురించి తీవ్రంగా సందేహం కలిగియున్నాడు (పోల్చు నిర్గమకాండము 4:10). అయినా, దేవుడు అతనిని తన పక్షంగా మాట్లాడుటకు మరియు పనిచేయుటకు "తగిన వానినిగా" చేసాడు. ఆమోసు తాను ప్రవక్త కానని, లేక తాను ప్రవక్త కుమారుడు కాడని చెప్పుకొన్నాడు (ఆమోసు 7:14). దేవుడు వారిని "తగినవారుగా" చేశాడు కాబట్టి వారు సామర్థ్యము గలవారైయున్నారు. దేవుడు తనను నిశ్చయమైన పనికొరకు వాడుకోగలడనే నమ్మికవలన పౌలు సామర్థ్యం వృద్ధిపొందింది.

ఈ విషయమును కొన్ని సంవత్సరముల పూర్వం యిర్మీయా ప్రకటించాడు. దేవుడు "ఇశ్రాయేలువారితోను యూదావారితోను" క్రొత్త నిబంధన (యిర్మీయా 31:31) చేయు నూతన దినమును గురించి అతడు వివరించాడు. ఆ నిబంధన, రాతి మీద వ్రాయబడిన పాత నిబంధనలాంటిది కాక, "వారి హృదయముల" మీద (31:33) వ్రాయబడును. మోషే నిజముగా పాత నిబంధనకు పరిచారకుడై ఉన్నట్టె, పౌలు నూతన నిబంధనకు పరిచారకుడని విశేషంగా చెప్పుకొన్నాడు. నిజానికి, అతని చదువరులు అతని సిఫారసు పత్రికలైయున్నారు. ఆ సిఫారసు పత్రిక "హృదయముల మీద" (3:2) పౌలు "పరిచర్య" మూలముగా (3:3) వ్రాయబడింది. అంటే, అతని పనికి ఫలితమును అతడు చూచాడు. క్రొత్త నిబంధనను దేవుని పక్షమున "అందించువాడుగా" పౌలు అతని పని ద్వారా జీవితములు మార్పు చెందుటను చూచాడు. పౌలు ద్వారా దేవుని చిత్తమును "హృదయముల మీద రాసుకొన్న" సంఘం జీవములోనికి వచ్చింది. తత్ఫలితంగా, "దేవునియెడల మాకిట్టి నమ్మకము కలదు" అని చెప్పుకొన్నాడు. అందరకు తెలిసిన "ధైర్యం" కంటే యిది భిన్నమైనది.

స్వశక్తినే నమ్ముకొనవలెను అనే నియమం ప్రజాదరణ (మరియు విరోధుల) పొందుచుండుట మరియు అతి దొడ్డపనియని యెంచి అందులో బలత్కారంగా పట్టబడి మునిగిపోవుటకు వ్యతిరేకంగా

పౌలు ధైర్యం వాటిని తొలగించింది. ఈ రెండు అభిప్రాయాలు నేటి సంఘమునకు శోధనగాను, ప్రమాదకరమైనవిగాను ఉన్నాయి. 3:1లోని సిఫారసు పత్రికలవలె మనం సాధించినవాటికి సంబంధించిన గణాంక పట్టికను చూపించ బలవంత పెట్టబడుతాం. బాబెలు గోపురమును కట్టుకొని "పేరు సంపాదించు" కొందమనుకొనిన వారివలె (ఆదికాండము 11:4) సంఘము తన ప్రతిష్ఠను యితరులలో పెంపొందించుకొనుటలో శ్రద్ధకలిగియుంటూ "తమ్మును తామే అమ్ముకొంటున్నారు." మన చుట్టూ ఉన్న సమాజములో పని చేస్తున్న ప్రమాణములను అనుసరించి మన సామర్థ్యమును కొలిచి చూచుకొంటాం. మిషనరీల, ఉపదేశకుల, సువార్తికుల మరియు యితరుల విజయమును కృత్రిమమైన కొలమానాలద్వారా కొలుస్తాం. స్వశక్తినే నమ్ముకొను వారికి యిచ్చిన పౌలు ప్రత్యుత్తరం సంఘమునకు సహాయకరమైనది. మన ధైర్యం మన సామర్థ్యములయందు కాదు. అయితే, వాస్తవానికి, "మా సామర్థ్యము దేవునివలన" కలిగింది. మేము "మృతులను లేపు దేవునియందేగాని, మాయందే మేము నమ్మికయుంచుకొనలేదు" (1:9).

## పాత నిబంధననుండి పాఠం (3:7-16)

పౌలు తన విషయమును స్థాపించుటకు పాత నిబంధనను తరచుగా ఉదాహరించుతున్నప్పటికి, విస్తారిత పాఠమునకు వాడడం అరుదుగా ఉంటుంది. కావున, తన పరిచర్య పక్షమున వాదించిన వాదన మధ్య భాగములో 3:7-16నందు పాత నిబంధననుండి దీర్ఘ పాఠమును అందిస్తున్నాడు. మోషే దేవునితో ఆ పర్వతం మీద మాటలాడి దిగివచ్చిన తరువాత అతని ముఖము ప్రకాశించిన సంగతిని పౌలు గుర్తు చేసాడు (నిర్గమకాండము 34:29-35). మోషే మహిమ ప్రభావములు అతనిని యితరులనుండి ప్రత్యేకించిందని ఆ కథ సూచించుతుంది. మోషే యొక్క అద్వితీయ మహిమను రబ్బీలు సంవత్సరాల తరబడి చెప్పుచూ వచ్చారు. ప్రజల యెదుట ఉన్నప్పుడు మోషే తన ముఖముమీద ముసుకు వేసుకొన్నాడనేది అతని పరిచర్య భయము కలిగించునదిగా ఉన్నట్టు తెలుపుతొంది. పౌలు తన పరిచర్యను గురించి మాటలాడుటకు మహిమగల ఆ పరిచర్య కథను ఎన్నుకొన్నాడు.

ఈ సందర్భములో పౌలు ఆ కథనుండి పాఠమును అందించుటకు ఎందుకు పూనుకున్నాడనేది ఖచ్చితంగా మనకు తెలియదు. ఆయన దానిని ఎక్కడా ప్రస్తావించలేదు. పౌలు విరోధులు మోషేవలె మహిమగలవారుగా ఉన్నారని చెప్పుకొనుచున్నారేమో. మోషే చేసిన బలంగల కార్యముల యెదుటను, అసాధారణమైన ప్రత్యక్షత యెదుటను పౌలు ఏమియూ లేనివాడే. పౌలు పరిచర్యను పోల్చి చూస్తే, ప్రభావితం చేయునది కాదు. మోషేతో పోల్చుట ద్వార పౌలును అవమానించి, అతని పరిచర్య క్షీణించినది మరియు మహిమలేనిదని చూపుతుంది. మోషే వైపు చూచి కొందరు తమ్మును రూపొందించు కొంటున్నప్పటికి, పౌలు మోషే పరిచర్యలోని మహిమను కాదనలేదు. వాస్తవానికి, "మహిమగలది" (*doxa*; NIV, "glory") అనే పదం తరచుగా 3:7-11ల్లో మోషే పాల్గొన్న "పరిచర్యకు" సంబంధించి కనిపిస్తుంది. పౌలు పాత నిబంధనను చదువుతున్నాడు గనుక అది దేవునినుండి కలిగిందని ఎరిగియున్నాడు. మహిమ దేవునినుండి కలిగింది కాబట్టి ఆ కథను గురించి ప్రసిద్ధముగా ప్రకాశించుచున్నది. అయితే, పరచర్య మానవునినుండి కలిగింది కాదు. ఈ మనిషి పని వెనుక దేవుని శక్తి ఉందని ప్రకాశించుచున్న మోషే ముఖము జ్ఞాపకం చేస్తుంది.

పాత నిబంధనను లోతుగా నేర్చుకొన్నప్పుడు మాత్రమే వారి పనిని గ్రహించగలరని క్రైస్తవులకు జ్ఞాపకం చేయవలసిన అవసరం ఏర్పడింది. పాత నిబంధననుండి క్రొత్త నిబంధనను సేవించుటకు ఆది సంఘం ప్రయత్నించలేదు. దేవుని యెడల మన పరిచర్య మోషే పరిచర్యను కొనసాగించునదై ఉంది. కావున, ప్రవక్తల ద్వారా "యెహోవా వాక్కును" అందించినప్పుడు మనం వింటున్నాం. పౌలు గుర్తించినలాగుననే, మొదటి నిబంధన "మహిమగలదని" మనముకూడ గుర్తించుతున్నాం (3:7). అది ఎంతో శక్తిగలది గనుక ఆ గొప్ప వెలుగు లేకుండ మనం ఏ పనిని జరుపుకొన లేమని ఎరుగుదుము.

3:7-11లో అంతకంటె అనంతమైన అధిక ప్రకాశముగల మహిమ వివరించ బడింది. మోషే పరిచర్య మహిమతో వచ్చిందని పౌలు సమ్మతించుతు, ఆత్మ సంబంధమైన పరిచర్య ఎక్కువ మహిమగలదని చూపాడు. పౌలు పరిచర్యతో పోల్చి చూస్తే పర్వతం మీదనుండి దిగివచ్చినప్పుడు భయపెట్టినట్టి మోషే ఏమియూ లేనివాడు. పౌలు పరిచర్య అంధకార లోకములో కడసారిగా ప్రకాశించుచున్న దేవుని వెలుగు. అది బ్రతుకులను మార్చి మరియు వారిని "నీతికొరకు" పునరుద్ధరింపచేయు శక్తిగలది (3:9). మునుపు ఉన్న వెలుగు కాంతిమంతగా ప్రకాశించుచుండగా, గొప్ప వెలుగుతో పోల్చి చూస్తే దాని కాంతిని పోగొట్టుకొన్నది (3:10).

తన పరిచర్య దాడికి గురియైనదని పౌలు ఎరిగియున్నాడు. అయినప్పటికి, అతడు సమస్యలుగల సంఘముతో ప్రతిఫలంలేని ప్రయాసను ఎందుకు కొనసాగించుచున్నాడో తెలుపుటకు సవాలును ఎదుర్కొన్నాడు. ఈ వాక్య భాగములో, పరిచర్యలను పోల్చుతున్నాడు. మోషేకంటె అత్యధికమైన మహిమగల పనిలో దేవుని పరిచారకుడుగా ఉండుటకు పౌలు పిలువబడ్డాడని అతడు ఎరిగియున్నాడు. పౌలు "దైవదత్తమైన తేజస్సు" ("చరిస్మా") మరియు మహిమలోను కొదువగలవాడు గనుక అతడు పరిచారకుడుగా ఉండుటకు తగినవాడుకాడని యితరులు చెప్పుకొంటున్నారు. యితరులు ఎదురు చూస్తున్న దానికంటె భిన్నమైన మహిమ ఈ నూతన రకమైన పరిచర్యకు ఉందని పౌలు ఎరిగియున్నాడు. లోకములో అతి ముఖ్యమైన ఉద్యమంలో పౌలు దేవుని ప్రతినిధిగా ఉన్నాడు.

ప్రకాశించుచున్న మోషే ముఖమువలె - వారు సాధించిన వాటిని, అనుభవములను వక్కాణిస్తూ - వారి పని యొక్క మహిమ కనిపిస్తుందని పౌలు విరోధులు నిస్సందేహంగా చెప్పుకొన్నారు. అయితే, మహిమను కొలిచి చూసుకొను మరొక ప్రమాణమును పౌలు చూపించాడు. దేవుడు తన ప్రజలను, యితరులకు సిలువను స్పష్టపరచు, భిన్నమైన మహిమ కొరకు పిలిచాడని సంఘమునకు జ్ఞాపకం చేయవలసి వచ్చింది.

ఇతరులను ప్రభావితం చేయలేని పౌలువంటివారు దృఢ నిశ్చయతతో ఎలా మాటలాడగలరని, కొరింథీ సంఘముతో పాటు, పూర్వకాలమందున్న పర్యవేక్షకులు ఆశ్చర్యపోయారు. మోషే కథనుండి పౌలు యిలా ముగించాడు, "యిట్టి నిరీక్షణగలవారమై బహు ధైర్యముగా మాటలాడుచున్నాము" (3:12). పనివలన పౌలు భయపెట్టబడలేదు. "ధైర్యముగా" (*parrhesia*) అనేది పౌలు పరిచర్య యొక్క ముఖ్య లక్షణం. ఏ యోగ్యత లేనివాడని ప్రశ్నింపబడ్డ ఈ మనిషి "నమ్మకముగలవాడు" (3:4), "ధైర్యముగలవాడు" (3:12) మరియు "స్వాతంత్ర్యముగలవాడని" (3:17) చెప్పుటయే 3వ అధ్యాయము యొక్క ముఖ్యమైన ధోరణియైయుంది. అతడు స్వతంత్రుడుగా ఉన్నాడు. నెలకొని ఉన్న అభిరుచులకు అనుకూలంగా

అతడు తన సందేశమును మార్చుకొన్నవాడు కాదు లేక ఒప్పింపబడనివారి యెదుట అతడు మౌనంగా ఉండలేదు.

ప్రాచీన ప్రపంచంలో "ధైర్యం" కొరకు పౌలు ఉపయోగించిన పదం ముఖ్యమైనది. ఈ పదమునకు "మాట్లాడు స్వేచ్ఛ" అని అర్థం. ఇది ఒక రాజు యెదుట లేక క్రూర పాలకుని యెదుట, వారికి ప్రియమైనది కానప్పటికి, ధైర్యముగా నిలబడి సత్యమును చెప్పగల ఒక తెలివైన వెక్తి యొక్క నడవడిని తెలుపుతుంది. స్వార్థవాదుల పాఠశాల స్థాపకుడైన డెయోగెన్స్ గురించి ఒక కథను చెప్పారు. మహా అలెగ్జాండర్ ఆ తత్వశాస్త్రవేతను ఒక సారి సందర్శించి, ఈ మహా సేనా నాయకుడు ఏమైనా చేయవలనా అని అడిగాడు. "నా సూర్యునినుండి కొంత దూరం ఉండు" అనే జవాబును తాత్వికుడు యిచ్చాడు. అతడు అతని సందేశమును గురించి ఖచ్చితంగా ఉన్నాడు గనుక అతని సంపూర్ణ స్వాతంత్ర్యం మరియు ధైర్యం నిమిత్తం గుర్తింపబడ్డాడు.

పౌలు తన మహిమగల పరిచర్యనుబట్టి స్వాతంత్ర్యంతోను (3:17) మరియు ధైర్యముతోను (3:12) మాట్లాడెను. తగ్గిపోతున్న మహిమగల తన పరిచర్యను ఇశ్రాయేలీయులనుండి దాచుటకు (3:13) మోషే "ముసుకును" ఉపయోగించాడు. పౌలు దినాలలో కూడ అనేకులకు గ్రహింపు కలుగకుండునట్టును, కలవరపెట్టునట్టును ముసుకు వేయబడెను (3:14, 15). ఏలయనగా, వారు క్రొత్త నిబంధన యొక్క గొప్ప మహిమను గుర్తించ లేకపోయిరి. వారికి, వారి పరిమితిగల పరిశీలనలో, పౌలు కలిగియున్న ధైర్యం అవివేకంగాను, ప్రభావితం చేయ లేనిదిగాను ఉంది. "ప్రభువు వైపు తిరుగువారు" (3:16, 17) అధిక మహిమను చూచుటకు పౌలు యొద్ద స్వాతంత్ర్యం కలదు. సత్యము విముక్తి కలుగజేయునంతగా మరేదియు చేయలేదు. "వారి హృదయము ప్రభువు వైపునకు" ఎప్పుడు తిరుగునో అప్పుడు ముసుకు తీసివేయబడును అని పౌలు అన్నాడు (3:16). క్రీస్తుతో అనుకోని ఈ సమావేశం మనలను స్వతంత్రులునుగా చేయును: "ప్రభువు యొక్క ఆత్మ యెక్కడనుండునో అక్కడ స్వాతంత్ర్యముండును" (3:17).

## రూపాంతరం చెందుట (3:18)

"మనమందరము ముసుకు లేని ముఖముతో ప్రభువు యొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధిక మహిమను పొందుచు, ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే" మార్చబడినప్పుడు అసాధారణమైన స్వాతంత్ర్యమును అనుభవిస్తాము (3:18). మోషే దేవునితో కలుసుకొనినందున అతడు మాత్రమే మార్పు చెందాడు. ఇప్పుడు "మనమందరము" – పౌలు మరియు సంఘమంతయు – ప్రభువు సారుప్యమునకు మార్చబడుదుము, "మనము ఆయనను పోలియుందుము" అని 1 యోహాను 3:2లో మనకు తెలియజేయబడింది. "రూపాంతరం చెందుట" అనే పదం *metamorpheo* అనే గ్రీకు పదమునుండి వచ్చింది. ఆంగ్ల భాషలో "metamorphosis" అని ఉంది. క్రైస్తవుడు క్రీస్తును తేరి చూచుటవలన ఆయన "పోలికలో మార్పు చెందుతాడని" లేక "రూపం మారుతుంది" అనే అర్థమును యిస్తుంది. మనస్సు మారి నూతనమగుటవలన "రూపాంతరము" పొందుడని మనకు చెప్పబడింది (రోమీయులకు 12:2). గలతీయులకు 4:19లో, "... క్రీస్తు స్వరూపము మీయందేర్పడు"వరకు అని పౌలు చెప్పాడు.

క్రైస్తవుడు శ్రద్ధగా దేనిని చూచునో దాని పోలికలో "రూపాంతరం" చెందుతాడు. మనము క్రీస్తు మహిమను తేరి చూచినయెడల, మనము కూడ, మోషేవలె ఆ మహిమలోనికి మార్చబడుదుము. "తేరి చూడు" (*kaloptrizomai*) అనే గాఢమైన పదం అద్దములో "తేరి చూచుట" లేక "ధ్యానించుట" అని వాడబడింది. ఆ పదం అపరిపూర్ణమైన అద్దములో తేరి చూచుకొనుటను లేక నీటివాగులో కనిపించు రూపమును జాగ్రత్తగా ఆలోచించుటను సూచిస్తుంది. ఆ పదం కేంద్రీకృతమైన తేరి చూచు భావముతో పాటు, క్రైస్తవులు క్రీస్తుని ధ్యానించుటను సూచించుటకు తగినదిగా ఉంది.

మనము దేనిని ధరించెదమో అది మనలను తీర్చిదిద్దును. మనము అవమానకరమైన దానిని తేరిచూచిన యెడల, మనము అవమానమును ప్రతిబింబింపజేస్తాం. పౌలు విరోధులవలె, మనము కృత్రిమ పద్ధతిలో పెంచబడినయెడల బజారులో ఉపయోగించిన ప్రమాణములతో మన కార్యక్రమాలను అంచనా వేస్తాం. చెప్పుటకు సంఘమునకు ఏమియు లేకుండును. అది యితరుల ప్రతిబింబిం మాత్రమే. అయితే, యితరులకొరకు తననుతానే అప్పగించుకొనిన మనిషియొక్క ప్రకాశించు వెలుగుపై జాగ్రత్తగా తేరిచూచినయెడల మనము అతని మహిమలోనికి మార్చబడుదుము. ఆయనవలన మనము మార్చబడినయెడల, మనము పౌలు యొక్క నమ్మకమును, ధైర్యమును, స్వాతంత్ర్యంలోను పాలు పొందుదుము.

క్రైస్తవులు దేనిని తేరిచూచుదురో దానివలన "రూపాంతరము" చెందినయెడల, అది క్రైస్తవుని ప్రత్యేకమైన చిహ్నం. మనమందరము స్వార్థరహితమైన ప్రేమ కథవలన రూపాంతరం చెందవచ్చును. "దేవుని మహిమను చూడగల" అవకాశము కలిగి వారి జీవితముల ద్వారా దీర్ఘ కాలం దానిని ప్రతిబింబింపజేయగల నాయకులను వెదుకుదుము. మన పరిచర్యలు ఒక ప్రమాణం ద్వారా తీర్పుతీర్చబడును: సేవ చేయుటకు వచ్చిన వాని ఉద్దేశమును ప్రతిబింబింప జేయువారు.

## ముగింపు

హిట్లర్ కాలంలో నాజీ కోర్టులో హాజరు కావలెయునని ఒకసారి ఒక భక్తిగల విశ్వాసిని ఆజ్ఞాపించిరి. విశ్వాసి తాను చేయుచున్న పనుల విషయమై అడిగిన ప్రశ్నలన్నిటికి సత్యాన్ని చెప్పాడు. ఆ గదిలో తాను ఒక్కడు మాత్రమే స్వేచ్ఛగా ఉన్నాడనిపించింది. న్యాయవాది మరియు SS సైనికులు భయాందోళనలను కలిగి ఉన్నారు. వారి చింత వారి ముఖములను మోసగించింది. మరొక ప్రభువును సేవిస్తున్న విశ్వాసి మాత్రమే స్వతంత్రుడు. ఈ వాస్తవం మాట్లాడుటకు అతనికి ధైర్యానిచ్చింది.

ధైర్యం క్రైస్తవ చిహ్నం. అయితే అది ఆత్మ విశ్వాసం కాదు, మన కృత్రిమ పద్ధతుల విలువలను ప్రతిబింబింప చేయువాటినుండి విడిపించు మహిమను చూచిన జ్ఞానమది. దేవుని కొరకు మనము ధైర్యముగా మాటలాడుదుము. ఏలయనగా "మన సామర్థ్యము దేవునివలననే కలిగియున్నది" (3:5).